# తెరమఱుగున గాథ

— "జగం"

ఉబుక్కుంటూ వచ్చే దుఃఖతీవ్రతను ఆపుకోవాలని ఎంతో ప్రయత్నించీ సఫలత్వంతో దాని ఛాయలు మొగంలో తెలుపుడుజేస్తూ—కంఠస్వరంలోని రుద్ధత్వాన్ని-ఎంతో ప్రయత్నంతో వారించుతో మగని దగ్గరకుజేరి యిలా అంది సత్యవతి :

“ఏమండీ! యిక చూడలేనండీ! నెలదినాల నించీ రోగంతో తీసుకుంటూన్న కన్నబిడ్డ దురవస్థను కళ్ళారచూస్తూ ఏతల్లి గుండె రాయిజేసుకొని వుండగలదండీ!--నేను యింతవరకూ ఏవస్తువుకోసంగాని-మరేవిషయంలో గాని బాధకలిగించి ఎరుగను. ఇక ముందు మిమ్మ బాధించనూలేను.— కాని— కాని కన్నబిడ్డ మరణయాతన చూడలేక కడుపు తరుక్కుపోతూవుంది.—ఎలాగైనా సరే పదిరూపాయలు—పదిరూపాయలు తెచ్చి వైద్యునికివ్వండి.—అలా చెప్ప యివ్వనిపక్షంలో మందు యివ్వనని చెప్పి వెళ్ళిపోయాడు డాక్టరు.—...”

సత్యవతి నోటవెలువడే ప్రతిమాటా బ్రహ్మానందం హృదయాన్ని కలచివేయసాగింది. ‘పదిరూపాయలు యివ్వందే మందు యివ్వనన్నాడు డాక్టరు!’—ఓపికతో అంతవరకూ మాత్రమే వినగలిగాడు. ఆపిదప ఆమె ఏమిచెప్పుకుంటూ పోయిందో ఏమో !— మొగంవాల్చి--కన్నులలో నిండిన నీళ్లను పంచెచెంగుతో ఒత్తుకున్నాడు.

సత్యవతి తన హృదయావేదాన్ని ఆపుకోలేక—పొర్లిపోయే దుఃఖాన్ని అరికట్టేందుకు పైటచెంగు నోటకుక్కుకొని—అచ్చట నిలువలేక పరుగునపోయి—జబ్బుతో పడివున్న బిడ్డ మంచందగ్గఱ కూలబడి—తలను దానిపైనఆన్చి వాపోయింది తమ దుస్థితికై.

మంచందగ్గఱ సత్యవతీ—డ్రాయరు ముందు బ్రహ్మానందం దహించుకుపోయే హృదయాలతో—కళ్ళనుంచి రాలే అశ్రువులతో తమ భారమైన సంసారజీవితచరిత్ర వెనుకటి పుటలను లోలోన వల్లించుకోసాగారు.

రాత్రింబవళ్లు ఏకదీక్షగా శ్రమపడి నిర్మించిన పుస్తకాల గుట్టలుగుట్టలు ప్రచురణకర్తల యినుపపెట్టెలు నింపడానికే పనికివచ్చినై. కాని తమ విషయంలో మాత్రం కలిగిన కాస్తా హరింపజేసినై. ఎంత ఆశ్చర్యం! శ్రమకు కలిగిన ఫలితం ప్రచురణ కర్తలకా? కడుపునింపని— కట్టబట్టనైనా యివ్వలేని కీర్తి తమకా? యిలాంటి హీనస్థితి సంభవిస్తుందని ముందు వూహించగలిగివుంటే విలువగల కాలాన్ని నిరర్థక కవితాసేవనలో గడపకపోయివుందునే అని విచారంతో సగమైపోయాడు బ్రహ్మానందం.

ప్రపంచమంతా ‘బ్రహ్మం’ అనే పేరుతో ప్రచురింపబడే రచనలకు ఎంత అభిమానాదరణలను చూపేవాళ్ళో చెప్పడం కష్టమే. అలా అతని రచనల నాదరించి నుతించేవాళ్ళలో ఏ ఒక్కరైనా వూహించగలిగారా ‘బ్రహ్మం’ బిడ్డడి మరణాసన్న కాలంలో మందుకైనా చిల్లిగవ్వ చేత లేక యిలా వ్యధితహృదయంతో కుమిలిపోతూ వుంటాడని ?— ఊఁహూఁ! వాళ్ళకు రచయితయొక్క జీవితచరిత్ర అనవసరం. అతడు ఏదురవస్థలపాలైనా తమకు వాటితో పనిలేదు. వాళ్ళకుకావలసింది అతని రచనలోని ప్రతిభ మాత్రమే. దానితో వాళ్ళు తృప్తిపొందుతారు. అచ్చుఖర్చుక్రింద నిచ్చే డబ్బుతో ప్రచురణకర్త లక్షల నార్జించుకుంటాడు. ఇక

రచయితకు మిగిలింది ఏముంది ?—పేరు ! పేరు !!– ఎందుకూ కొరగాని ఒక పేరుమాత్రమే !—

సజలనేత్రాలతో ఎదుటగల పుస్తకాలను చూస్తూన్నాడు బ్రహ్మం.—అలా కొంతసేపు చూచి చూచి— —మెల్లగాలేచి సత్యవతిదగ్గఱకు వెళ్ళి నిలిచా. అడుగుల సవ్వడివిని తల ప్రక్కకు త్రిప్పి జాలిగా చూచింది ఆమె.

తలపైన చేతినిడి—జాలితో తొణికిసలాడే గొంతుతో—"సత్యం! ఏడువకు. యిప్పటివరకు ఎలా ఓర్పువహించావో అలాంటి ఓర్పునే ప్రదర్శించు.—నీలాంటి ఓర్పుగల స్త్రీ నాకు భార్యకావడం మూలంగానే యింతవరకు యిలానైనా జీవించి వున్నాను. లేకుంటే—సత్యా! యీ జీవితచరిత్ర ఈ పాటికి ఏవిధంగా ముగింపు అయివుండేదో సుమా!—" ఏదో యింకా మాట్లాడేందుకే ప్రయత్నించాడు. కాని ఒక్క అక్షరంకూడా బైటకు రాలేదా దుఃఖంతో పూడుకుపోయిన గొంతునించి.

మగని దీనావస్థ మరింత బాధనుగలిగించింది సత్యవతికి. దుఃఖాన్ని ఆపలేక వెక్కి వెక్కి ఏడ్చింది కొద్దిక్షణాలపాటు ప్రయత్నించి బలవంతాన పొంగి పొర్లుకువచ్చే దుఃఖాన్ని ఆపుకొని—"నిజంగా మీరన్నట్లు యింతవరకూ ఓర్పుతోనూ—ఆశతోనే జీవించాను. మీ మనస్సు ఎక్కడ నొచ్చుకుని బాధ కలిగించుతూందోనని ఎంతో జాగ్రతగా సంసార యాత్రను సాగించాను. కాని, యిక—యిక ఆ ఓర్పూ ఆ ఆశా నాలోనిలువక—నన్ను విడిచిపోతూన్నాయి. నేను అశక్తనైపోయాను. ఎలా అంత శక్తిని పొందగలను చెప్పండి. కన్నబిడ్డ రోగానికి పదిరూపాయలులేవే!—ఒక జీవనం విలువ యింత తేలిక ధనంతో—"

బిడ్డదివంక చూస్తూ యీమాటలు పలకడం వల్ల తిరిగి దుఃఖం ఆమెను ముంచుకువచ్చి నోటమాట రాలేదు.

"ఓర్పును కోలుపోవచ్చు సత్యం!—ఆశను కోలుపోవద్దు.—ప్రపంచలోని ప్రతిజీవి ఆశతోనే జీవించడం ముఖ్యం.—కొడుకు రోగానికి పదిరూపాయలు ఖర్చుపెట్టలేక పోయామని—నిరాశతో క్రుంగిపోకు.—నీవే యిలా క్రుంగిపోతే నేనింకేం జీవితయాత్ర సాగించగలను చెప్పూ! నేనూ ఆశతోనే —ముందుముందు సుఖసౌఖ్య జీవనులం కాగలమనే ఆశతోనే జీవించగలుగుతూన్నాను. అట్టి ఆశ నిరాశ అవుతూందా ?—పిచ్చి సత్యా! ధైర్యంవహించు.—"

అంటూనే ఆమెను లేవదీసి మంచంపై కూర్చుండబెట్టాడు. అలా కూర్చుండబెట్టుతూనే—'ఆ! సత్యా! మొన్ననే పత్రిక సంపాదకునికి జాబు వ్రాశాను. అందులో మన కష్టచరిత్రకూడా వివరిస్తూ చాలా తొందరగా డబ్బుపంపమని కోరాను. వాళ్లు తప్పక పంపుతారు. అది డాక్టరుగారికి యిచ్చి అబ్బాయికి మందుయిప్పించుదాం—" అన్నాడు.

యింతవరకూ నిరాశతోవున్న సత్యవతి హృదయంలో యీవార్త వినడంవల్ల ఆశారేఖ మెరిసింది. కొంత ధైర్యం కలిగింది.—మెల్లగా మంచంనించి లేస్తూ—"అయితే తప్పక డబ్బువస్తూందికదూ!"

"ఓ, యివ్వాళ పోస్టుకే రావచ్చుకూడా!–" చాలా ధైర్యంగా అంటూ ఆమె వీపు నిమిరాడు దగ్గరకుతీసుకొని. ఆమె మొగం అతని గుండెలకుజేర్చి దీర్ఘనిశ్వాసవిడిచింది కొంత తేలికపడ్డ హృదయంతో.

౨

కొడుకును ఒడిలోపెట్టుకొని ఏడుస్తోంది సత్యవతి. గుమ్మంలోనిలచి వీధిలోకి శూన్యదృక్కుల బరపుతూవున్నాడు బ్రహ్మం. రెండురోజులనించీ—డబ్బు వస్తూందనే ఆశతోనేవున్నారు, ఆడబ్బుకై వాళ్ల ఆత్రమెలా ద్విగుణీకృతమై పోసాగిందో—అంతకు మిన్నగా వాళ్లబిడ్డ మరణసమయం చేరువవుతూ—రోగం ముంచుకొనివచ్చింది.

బ్రహ్మం—ఎంతో బ్రతిమలాడాడు డాక్టరుబాబుని. తాను జన్మించినప్పటినుండీ యిప్పటివరకూ

యింత దీనంగా ఎవరినీ యాచించి ఎరుగడు. నిరంకుశమైన అతని ప్రవర్తనమంతా కన్నబిడ్డ ప్రాణరక్షణకోసం నీరుకారి నిశ్చలమయిపోయింది. ఐనా ఏంలాభం?—అతగాడి కన్నీరు—ప్రార్థనలు ఆ డాక్టరు బాబు హృదయాన్ని కరిగింపలేక పోయినై!

ఆశానిరాశల మధ్య కొట్టుమిట్టాడిపోతోంది వాని హృదయం. కర్తవ్యశూన్యుడై అలానే గడప నానుకొని నిలచివున్నాడు. యీనాడైనా డబ్బువస్తే—బిడ్డడి ప్రాణం రక్షింపగలమేమోననే ఆశతో అతడి ప్రాణం తపతపలాడి పోసాగింది. అదే ఆలోచన! ఆ ఆలోచనలో ఎంత సమయం పరుగులెత్తి పారిపోతూందో గమనించనైనా లేని స్థితిలోవున్నాడు.—తనముందునించి రోడ్డుపై ఎవరు వస్తూనారో—పోతూన్నారో—అతడేమీ పరికించడంలేదు. దీక్షగా చూపునిలిపి లోలోన ఏమో ఆలోచంచుకోసాగాడు.

"బాబుగారూ!—" పోస్టుజవాన్ కాళిదాసు పలుకరించాడు. ఆపలుకు చెవులపడట్మే విచిత్రమయిన పరివర్తన కనిపించింది అతనిలో. తృళ్ళిపడ్డాడు.—ఆత్రంతో—'మణి ఆర్డర్ ఏమైనా—' "ఉహూఁ!—రాలేదు బాబూ! ఓకార్డూ—ఒపత్రికా—" అంటూ చేతికి అందిచ్చి ప్రక్కయింటికి పోయాడు పోస్టుమాన్.

ఓనిట్టూర్పుతో యింటిలోనకు పోతూ—తూలిపడబోయాడు నిస్పృహహృదయంతో. మెల్లగా తన్ను తాను తమాయింపజేసుకొని డ్రాయరుముందుకు జేరాడు. కార్డుపై దృష్టిని మళ్ళించాడు. అది పత్రిక ఆఫీసునించి వచ్చింది.—అనేక యోచనలతో ఆత్రంగా చదువసాగాడు. యిలావుంది ఆకార్డు:

"మహాశయా!

మీజాబు చేరింది. మేం ప్రస్తుతం ఏవిధంగానూ సహాయం చేయలేని స్థితిలోవున్నాం. యిందుకు మమ్మల్ని క్షమించాలి. మరోసారి మిమ్ములను సంతృప్తిపరచగలం. మన్నించ ప్రార్థన.

ఇట్లు సంపాదకుడు.

ఎడిటరు వ్రాసిన కార్డు పూర్తి అవడం—నిలువలేక నిర్వీర్యుడై కుర్చీలో కూలబడటం జరిగింది. నల్దిశలా ఘోర అంధకారమై పోయినట్లు కళ్లు చీకట్లు క్రమ్మినయ్ బ్రహ్మానికి.

యిలా బ్రహ్మం కుర్చీలో కూలిపోయిన సమయంలోనే కన్నబిడ్డడు కండ్లు తేలవైచి—తల్లి ఒడిలో ప్రాణాలు విడచిపెట్టాడు. హేయమైన జీవితాన్ని భరించలేనట్లుగా—ఒక్కసారిగా ఘొల్లుమంది సత్యవతి.—ఆ ఏడుపు ఎలా ఉద్విగ్నమైందో అలాగే క్రమేపి క్షీణదశతో చల్లారిపోయింది.—ఆ యిరువురు ఆలుమగలూ యధాస్థానాలలో కఱ్ఱబొమ్మల్లా వుండిపోయారు. నిశ్శబ్దంతో సమయం దొర్లుకొంటూపోయింది.



అయ్యా, నావద్ద మదురలో వుత్పత్తియగు టవల్స్, ఖండువాలు, దోవతులు, చీరలు, రకవారిగా వున్నది కావలసిన రకాలకు ఆర్డరు వ్రాస్తే ధరలు సలీసుగావేసి పంపిస్తాను.

పై అడ్రసుకు టపాలువ్రాసి అన్ని సంగతులు తెలుసుకోవలసినది.